పన్ను వెయ్యమంటే తిప్పుతున్నారు

● స్పందనలో రిటైర్డ్ ఉద్యోగి ఫిర్యాదు

మధురవాడ: ఆరిలోవలో ఉన్న తన ఖాళీ స్థలానికి వీఎల్‌టీ వెయ్యమంటే నెలల తరబడి తిప్పుతున్నారని, కనీసం ఫోన్‌లో వివరాలు అడిగితే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విశ్రాంత ఉద్యోగి వెంకటేశ్వర్లు ఆరోపించారు. తన పక్కనే ఉన్న బంధువులు బ్రోకర్లను ఆశ్రయిస్తే వారి స్థలానికి పన్ను వేశారని, తాను నేరుగా రావడంతో ట్యాక్స్ వేయలేదని వాపోయారు. కనీస గౌరవం లేకుండా రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతున్నారని జెడ్సీ కనక మహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు. సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని కోరారు. మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జెడ్సీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. శివశక్తినగర్‌లో ఊరు మధ్యలో మూడేళ్ల నుంచి మూసేసి ఉన్న రేకుల షెడ్ నుంచి పాములు, క్రిమికీటకాలు రావడంతో భయాందోళనగా ఉందని, చర్యలు చేపట్టాలని వి.కళవయ్య ఫిర్యాదు చేశారు. ఇలా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ కనక మహాలక్ష్మి హామీ ఇచ్చారు.


జోనల్ ఆఫీసులో జెడ్సీ కనకమహాలక్ష్మికి సమస్య వివరిస్తున్న వెంకటేశ్వర్లు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు నాలుగు వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి రెండు, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగాలకు ఒక్కొక్క వినతి వచ్చింది. వీటిని పరిశీలించి త్వరలో పరిష్కారిస్తామని జెడ్సీ తెలిపారు.


వినతులు స్వీకరిస్తున్న భీమిలి జెడ్సీ రాము

ఉత్సవాలకు గణపతి విగ్రహాలు సిద్ధం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో వినాయక విగ్రహాలు రంగుల హంగులు పూర్తి చేసుకుని ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. తయారీదారులు తుది మెరుగులు దిద్ది అమ్మకానికి సిద్ధం చేశారు. పాండ్రంగి గ్రామానికి చెందిన శిల్పకారుడు పొట్నూరు వెంకట రమణ కృష్ణాపురం రెల్లి కాలనీ సమీపంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు పక్కన వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ఇప్పటికే వంద, మట్టితో వంద బొమ్మలు తయారు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అడుగు నుంచి ఎనిమిది అడుగుల నిడివిలో, మట్టితో అడుగు నుంచి రెండు అడుగుల నిడివిలో విగ్రహాలు తయారు చేశారు. మూడు నెలల నుంచి బొమ్మల తయారీలో నిమగ్నమయ్యారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన బొమ్మలను రూ.1000 నుంచి రూ.15 వేలు వరకు, మట్టితో తయారు చేసిన బొమ్మలను రూ.800 నుంచి రూ.1000 వరకు అమ్ముతున్నారు. కావాల్సిన వారు 87900 33810లో ఆర్డర్ ఇవ్వవచ్చని వెంకట రమణ కోరారు.


సిద్ధమైన వినాయక విగ్రహాలు

క్లుప్తంగా

పోలమాంబ అమ్మవారికి కిరీటం బహూకరణ


అమ్మవారికి కిరీటం బహూకరిస్తున్న భక్తురాలు పుష్పలత

తగరపువలస: సంగివలస పోలమాంబ అమ్మవారికి అనిట్స్ బుక్స్ స్టోర్ యాజమాన్యం సోమవారం రూ.20 వేల విలువైన గోల్డ్ కోటెడ్ ఇత్తడి కిరీటం బహుకరించారు. దీనిని ఆలయ ఈవో బి.ప్రసాద్, కోరాడ శ్రీను చేతుల మీదుగా దాతలు ఆలయానికి అందించారు. కార్యక్రమంలో బుక్స్ స్టోర్ తరపున జి.పుష్పలత, కిషోర్‌కాంత్, వినీల, విశాల్, సరయు తదితరులు పాల్గొన్నారు.

జోన్ - 2 ఏసీపీగా శాస్త్రి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా శబ్‌నాన్ శాస్త్రి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కొద్ది నెలలు ఇక్కడ పనిచేసిన శాస్త్రి పెందుర్తి జోన్‌కు బదిలీ అయ్యి అక్కడి నుంచి జోన్ – 3కు వెళ్లి కొన్నాళ్లు పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వరరావు వీఎమ్ఆర్‌డీఏకి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ నిర్మాణదారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ఉల్లంఘించి చర్యలు తీసుకునే వరకు తీసుకు రావద్దని కోరారు.

బీచ్‌రోడ్డులో సప్తగిరి సందడి


భీమిలిలోని ఓ రెస్టారెంట్‌లో నటుడు సప్తగిరి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో సోమవారం నటుడు సప్తగిరి సందడి చేశారు. ఇక్కడి బీచ్ సమీపంలోని కొబ్బరి తోట వద్ద, భీమిలిలో గల ఓ రిసార్ట్‌లో ఆయన నటిస్తున్న సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ సినిమాకు పి.సుబ్రహ్మణ్యం దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం టైటిల్ ఖరారు చేయలేదని, త్వరలోనే పూర్తి వివరాలు తెలుపుతామని ఆయన అన్నారు.

కూరగాయలు, మొక్కల పంపిణీ


కూరగాయలు, మొక్కలతో ప్రతినిధులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల డి – పాల్ అనాథ పాఠశాలకు జేసీఐ వైజాగ్ ఎక్సలెన్స్ బృందం సోమవారం కూరగాయలు, మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కూరగాయలు, మొక్కలు ఇవ్వడం ద్వారా పిల్లలకు వ్యవసాయ ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో కో – ఆర్డినేటర్ షాబ్బం, ఫణికల్యాణ్, సాయి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాట మహోత్సవం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు భువనేశ్వర్ కాలనీలో నిర్వహించనున్న గణపతి నవరాత్రి ఉత్సవాలకు సోమవారం స్థానిక క్రేజీ బోయ్స్ ఆధ్వర్యంలో ఉత్సవ రాట వేశారు. ఈ నవరాత్రులు స్వామికి పూజలు నిర్వహించి, అన్నదానం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.


భువనేశ్వర్ కాలనీలో ఉత్సవ రాట వేస్తున్న భక్తులు

జోనల్ కార్యాలయం ఎదురుగా బెంచీల ఏర్పాటు

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయం ఎదురుగా, పరిసర ప్రాంతాల్లో సిమెంట్ బెంచీలను అధికారులు సోమవారం ఏర్పాటు చేయించారు. కార్యాలయం లోపల కొన్ని కుర్చీలు ఉండగా వివిధ పనులపై వచ్చేవారు ఎక్కువ మంది ఉండడంతో అవి సరిపోవడం లేదు. దీంతో చాలా మంది కార్యాలయం ఎదురుగా చెట్ల కింద నిలబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఇటీవల జీ – 20 సదస్సు సందర్భంగా ఇక్కడి బీచ్ సుందరీకరణ పనుల్లో భాగంగా కొత్త సిమెంట్ బెంచీలు రావడంతో వాటిలో కొన్నింటిని ఇక్కడ ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడకు వచ్చే వారు కూర్చోవడానికి సౌకర్యంగా ఉంది. అదేకాకుండా సాయంత్రం వేళల్లో పలువురు ఇక్కడకు వచ్చి సేదతీరడానికి ఉపయోగపడుతున్నాయి.


జోనల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు

కొత్తమ్మతల్లికి పుష్పాలతో అలంకరణ


పుష్పాలతో అలంకరించిన కొత్తమ్మ తల్లి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని సోమవారం సాయంత్రం 50 కిలోల లిల్లీ, కనకాంబరం, శంఖం పూలతోపాటు గజమాలలతో అలంకరించారు. ఈ ప్రత్యేక అలంకరణతో భక్తులకు మంగళవారం అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు అలంకరణ చేశారు. ఈ అలంకరణకు చిట్టివలసకు చెందిన దాతలు పంతిన శేషమ్మ, సన్యాసిరావు, సూర్యనారాయణ, రమణి తదితరులు సహాయ సహకారాలు అందించారు.

రోడ్డుపైకి వచ్చి విక్రయిస్తే చర్యలు

భీమునిపట్నం: భీమిలి మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న టిఫిన్ విక్రయదారులు రోడ్డును ఆక్రమించి విక్రయాలు సాగిస్తుండడంతో సోమవారం వాటిని తొలగించే చర్యలను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము చేపట్టారు. ఇక్కడి పాతబస్టాండ్ నుంచి చిన్నబజారు వెళ్తున్న మార్గంలో బస్టాండ్‌కు కొద్ది దూరంలో చిన్న మలుపు ఉండగా అక్కడ రోడ్డు వెడల్పు తక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలు సాగించడానికి కొంత ఇబ్బందిగా ఉంటుంది. అయినప్పటికీ కొద్ది నెలల క్రితం ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా టిఫిన్ స్టాళ్లు ఏర్పాటు చేసి ఇరువైపులా రోడ్డు మీదకు వచ్చి విక్రయాలు చేస్తున్నారు. అసలే ఇరుకుగా ఉండే ప్రాంతంలో ఆక్రమణల వల్ల రోడ్డు బాగా కుదించుకుపోవడంతో వాహనాల రాకపోకలకు చాలా సమస్యగా ఉంది. విషయం తెలుసుకున్న జెడ్సీ రాము ఈ షాపుల వద్దకు వెళ్లి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డు మీదకు వచ్చి ఆక్రమణలకు పాల్పడి విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా మాటా వినకుండా ప్రవర్తిస్తే ఆయా షాపులను మూయించి వేస్తామని పేర్కొన్నారు.


విక్రయదారులతో మాట్లాడుతున్న జెడ్సీ రాము

ఆక్రమణల తొలగింపు


బేస్‌మెంట్ తొలగిస్తున్న సిబ్బంది

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో రెవెన్యూ అధికారులు ఆక్రమణలకు అడ్డుకట్ట వేశారు. కాపులుప్పాడ సమీపంలో గల గొల్లల పాలెం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కల్యాణ మండపం వెనుక ఖాళీగా ఉన్న పది సెంట్ల స్థలాన్ని ఆక్రమించేందుకు ఓ వ్యక్తి నిర్మాణం చేపట్టాడు. గతంలో ఈ స్థలంలో కమ్మల పాక వేయగా, సోమవారం దాని చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు పునాదులు తవ్వి పనులు చేపట్టారు. ఈ విషయంపై స్థానికులు తహసీల్దార్ వేణుగోపాల్‌కు సమాచారం ఇవ్వగా ఆయన ఆదేశాల మేరకు వీఆర్‌వో అప్పారావు అక్కడకు చేరుకుని కమ్మలపాక, పునాదులు తొలగించారు. మరలా నిర్మాణం చేపడితే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లక్షలాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించే వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వేణుగోపాల్ హెచ్చరించారు.


కమ్మల పాక తొలగిస్తున్న అధికారులు

దంచికొట్టిన వర్షం


తగరపువలస వైఎస్సార్ కూడలి వద్ద ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం


చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద దంచి కొడుతున్న వర్షం

తగరపువలస: భీమిలి పరిధిలో సోమవారం మధ్యాహ్నం పన్నెండున్నర నుంచి మూడు గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ఎక్కడివారు అక్కడ ఉండిపోవాల్సి వచ్చింది. జన సంచారం లేక రోడ్లన్నీ బోసిపోయాయి. కారుమబ్బులతో ఆకాశం మూసుకుపోవడంతో పగలే చీకట్లు అలుముకున్నాయి. అత్యవసర పనుల మీద వచ్చేవారు వాహనాలతో రావడం కనిపించింది. కుండపోతగా కురిసిన వర్షానికి రహదారులు, పల్లపు ప్రదేశాలు జలమయమయ్యాయి. రోడ్లపైకి వచ్చిన వారు షెల్టర్లు, దుకాణాల వద్ద తలదాచుకున్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో వీధులన్నీ చెత్తమయం అయ్యాయి. వర్షం తగ్గిన తర్వాత పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. చెరువులు, ఖాళీ ప్రదేశాల్లోకి వర్షం నీరు భారీగా వచ్చి చేరింది. ఉదయం ఉక్కపోతతో ప్రారంభమైనప్పటికీ అంతలోనే వాతావరణంలో మార్పులు సంభవించి చల్లబడటంతో పలువురు ఉపశమనం పొందారు.

విజయనిర్మలకు పుట్టిన రోజు శుభాకాంక్షలు

తగరపువలస: వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పుట్టిన రోజు వేడుకలు సోమవారం సంగివలసలోని ఆమె నివాసంలో ఘనంగా నిర్వహించారు. భీమిలి అర్బన్, రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాలతోపాటు మధురవాడ జోన్, తూర్పు నియోజకవర్గం నుంచి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి కేక్‌లు కట్ చేయించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అక్కరమాని వెంకటరావు, బొడ్డు అప్పలనాయుడు, జీరు వెంకటరెడ్డి, చిల్ల బాబయ్య రెడ్డి, చింతగుంట శివ, చిల్ల గణేష్‌రెడ్డి, వెంపాడ వెంకటరమణ, చిల్ల వెంకటరమణ, దుంప సాయిరెడ్డి, ఒమ్మి దేవుడు, చిల్ల త్రినాథరెడ్డి, పందిరి విజయ్, జీరు వేణుగోపాలరెడ్డి, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంగివలసలో విజయనిర్మలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

కొత్త పింఛన్ల పంపిణీ


రేఖవానిపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీలో కొత్తగా మంజూరైన అయిదు పింఛన్లను సోమవారం గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మరో 20 పింఛన్లు రావాల్సి ఉందని సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి దుర్గాదేవి, వెల్ఫేర్ సెక్రటరీ నవీన, సచివాలయ కన్వీనర్ పలపాల పద్మ, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎం.హరిశంకర్, వార్డు సభ్యుడు ఎం.మహేష్‌వర్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

‘విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తక రచనలు’

ఏయూ క్యాంపస్: విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తక రచనలు చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు రచించిన ‘ఫిలసాఫికల్ పర్స్పెక్టివ్స్ ఆన్ టీచర్ ఎడ్యుకేషన్’ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భవిష్యత్ తరం ఉపాధ్యాయులుగా నిలిచే వారికి, ఉపాధ్యాయ వృత్తిలో అడుగిడే వారికి ఉపయుక్తంగా పుస్తక రచన చేయడం అభినందనీయమన్నారు. పరిశోధకులకు ఈ పుస్తకం ఒక చక్కని మార్గదర్శికంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం పుస్తక రచయిత షారోన్‌రాజును వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు, ఆచార్య రాంజీ, తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

రేపటి నుంచి జనరల్ యోగా తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 13 నుంచి జనరల్ యోగా, థెరపి యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నాలుగు బ్యాచ్‌లుగా తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

‘చంద్రబాబు అరెస్ట్‌తో ఎన్టీఆర్ ఆత్మకు శాంతి’

తగరపువలస: టీడీపీ అధినేత చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో జైలుకెళ్లడం ఇతరులకు గుణపాఠం కావాలని చిట్టివలస కాంగ్రెస్ కార్మిక సంఘం ప్రతినిధులు అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 40 ఏళ్లుగా చట్టానికి చిక్కకుండా స్కాములు చేసి స్టేలు తెచ్చుకున్న చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టేలా వ్యవహరించిన ఏపీ సీఐడీకి అభినంధనలు తెలిపారు. వ్యవస్థలను, చట్టాలను ఎల్లవేళలా మోసం చేసి ఆటలాడటం సాధ్యం కాదన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆత్మఘోషను యావత్ భారతదేశం మరచిపోలేదని... ఇన్నాళ్లకు బాబుకు తగిన శాస్తి జరడగంతో ఎన్టీఆర్ ఆత్మ శాంతిస్తుందని పేర్కొన్నారు.

నియోజకవర్గంలో బంద్ ప్రభావం నిల్

తగరపువలస/పద్మనాభం/మధురవాడ/కొమ్మాది/ఆనందపురం/పీఎం పాలెం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపునకు భీమిలి నియోజకవర్గ ప్రజలు స్పందించ లేదు. విద్యాసంస్థలు, బ్యాంకులు, సినిమా థియేటర్లు, వ్యాపార సంస్థలు, ఆస్పత్రులు సోమవారం యథావిధిగా తెరుచుకున్నాయి. ప్రైవేట్ మార్కెట్‌లో కార్యకాలాపాలు జరిగాయి. ఆర్టీసీ బస్సులు, ఆటోలు ప్రయాణికులతో ఎప్పటిలాగే రాకపోకలు సాగించాయి. మరోవైపు టీడీపీ, జనసేన నాయకులు కూడా బంద్ పాటించకుండా తమ వ్యాపారాలు కొనసాగించారు. బ్యాంక్‌లు కూడా తమ కార్యకలాపాలు కొనసాగించాయి. బంద్‌కు ప్రజల మద్దతు లేకపోవడం, పోలీసులు కూడా 144 సెక్షన్ అమలు చేసి పలుచోట్ల గస్తీ తిరగడంతో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల జాడ లేకుండా పోయింది. ఒకరిద్దరు రోడ్డు మీదకు వచ్చినా పోలీసులు ఉండటంతో నక్కినక్కి దుకాణాలు మూయాలని కోరినా వర్తకులు స్పందించలేదు.


బంద్ ప్రభావం లేకపోవడంతో మధురవాడలో బస్సులు, వాహనాల రాకపోకలు

● కొమ్మాది జంక్షన్‌లో టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, నమ్మి శ్రీను, వార్డు అధ్యక్షుడు సత్యనారాయణ, జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, ఈఎస్ఎస్ చంద్రరావు, సంతోష్ నాయుడు కాసేపు రోడ్డుపై బైఠాయించి రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం కల్పించారు. ఈ సందర్భంగా 2 అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. పోలీసుల రంగ ప్రవేశంతో నాయకులు అక్కడి నుంచి జారుకున్నారు. అయితే మధురవాడ ప్రాంతంలో టీడీపీకి ఇద్దరు కార్పొరేటర్లు ఉన్నా వారు ఎక్కడా రోడ్డెక్కే ప్రయత్నం చేసిన దాఖలాలు కనిపించలేదు.

● ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పీఎం పాలెం, బీచ్‌రోడ్డు, సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ, మంగమారిపేట, ఉప్పాడ ప్రాంతాల్లో బంద్ ప్రభావం కనిపించలేదు.

దివ్యాంగుల అభ్యున్నతికి ప్రోత్సాహం

పరవాడ: దివ్యాంగుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్య పరిశీలకులు డాక్టర్ రామ్‌కమల్, డాక్టర్ వై.నరసింహం చెప్పారు. పరవాడ భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష సహిత విద్య పరిశీలకుల బృందం సోమవారం సందర్శించింది. భవిత కేంద్రంలో దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రంలో 27 మంది బుద్ధిమాంద్యం కలిగిన చిన్నారుల అవసరాలు తీర్చడానికి వీలుగా ప్రభుత్వం రూ.2.70లక్షలతో సమకూర్చిన బోధన సామగ్రి కిట్లు, వినికిడి లోపం కలిగిన ఆరుగురు చిన్నారులకు రూ.1.80 లక్షల విలువైన వినికిడి యంత్రాలను పరిశీలకులు రామ్‌కమల్, నరసింహం అందజేశారు. అనంతరం కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో నిర్మించిన భవిత కేంద్రం పరిశీలించి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని అభినందించారు. అనకాపల్లి సహిత విద్య సమన్వయకర్త శకుంతల భవిత కేంద్ర పురోగతిని పరిశీలకులకు వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దివాకర్, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్, మహలక్ష్మినాయుడు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


వినికిడి యంత్ర సామగ్రి అందజేస్తున్న డాక్టర్ రామ్‌కమల్, నరసింహం

ప్రమాదకరంగా కల్వర్టు

ఆనందపురం : మండలంలోని ఆనందపురం – బోని మార్గంలో సాయిబాబా గుడి మలుపు వద్ద ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. అసలే ఎస్ ఆకారం మలుపు... ఆపైన కల్వర్టుపై పలకలు శిథిలం కావడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. వాహన చోదకులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా అదుపు తప్పి గోతిలో పడి గాయాల పాలవుతున్నారు. కొన్ని రోజులుగా ఇక్కడ ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు అంటున్నారు. ఇటీవల కల్వర్టులో చెత్త పూడికపోవడంతో పలకలు తొలగించారు. కానీ తర్వాత వాటిని అమర్చలేదు. దీంతో ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుపై పలకలు వేయాలని పలువురు కోరుతున్నారు.


సాయిబాబా గుడి మలుపు వద్ద పలకలు తొలగించిన కల్వర్టు